# భావనాసిద్ధి

("సాహితి" మాసపత్రిక - రుధిరోద్గారి సంవత్సర ఉగాది - మార్చి 1923)

**ల**క్ష్మణస్వామియు నూర్మిళయు మేనత్త మేనమామ బిడ్డలు. అసలా అమ్మాయిపేరు రామమ్మ. ఊర్మిళ యనే పేరు లక్ష్మణస్వామియే పెట్టినాడు. ఊర్మిళ పుట్టిననాడే లక్ష్మణ స్వామికి పెళ్ళాము పుట్టిన దన్నారు. వారిద్దఱు ఆడుకొనేటప్పుడు కూడ మగడును పెండ్లమే. ఊర్మిళ లక్ష్మణస్వామి కెప్పుడును సిగ్గుపడలేదు. ఆ పిల్లకు తొమ్మిదవయేట పెండ్లి చేసినారు. పెండ్లి రేపనగా నూర్మిళ యేదో ఆడుకొనుచుండగా లక్ష్మణస్వామి ఆటంతయు పాడుచేసినాడు. ఊర్మిళ యేడుస్తూ వాళ్ళ అమ్మ దగ్గరకు వెళ్ళినది.

**అమ్మ :** ఎందుకమ్మా! ఏడుస్తావు. కాటుక పాడైపోతుంది.

**ఊర్మిళ :** నేను ఆడుకుంటుంటే అంతా పాడుచేశాడు.

**అమ్మ :** ఎవరు?

**ఊర్మిళ :** లక్ష్మాయి.

అక్కడ నున్నవారందరు నవ్విరి. 'ధగిడా! రేపు మొగుడౌతూంటే నీకింకా వాడు లక్ష్మాయేనా' అన్నది వాళ్ళ మేనత్త. పెళ్ళిలో తలే వంచుకోలేదు ఎంతమంది చెప్పినా. ఒకరోజున సాయంతన మందరును తలవంచుకొమ్మని చెపుతూంటే ఊర్మిళ యెడమ మోకాలి మీద తలపెట్టుకొని చిఱునవ్వు నవ్వుతూ 'ఏమండీ, తలవంచుకోవాలీ!' అని అడిగినది లక్ష్మణస్వామిని. వాళ్ళ దాంపత్యాన్ని చూచి ముసలివాళ్ళందరూ 'అట్లా వుండాలమ్మా! చక్కగా, చిలకా గోరింకలల్లే' నన్నారు. కొంచెము పడుచుపిల్లలు మొగ్గ మడ్డముగా త్రిప్పుకొన్నారు.

ఊర్మిళ యిప్పుడు కాపురము చేయుచున్నది. వాళ్లిద్దరు భార్యాభర్తల వలె నుండరు. ఒకరోజున లక్ష్మణస్వామి వస్తే ఊర్మిళ లేచినది.

**లక్ష్మణ :** లేవ నక్కఱలేదులే, కూర్చో!

**ఊర్మిళ :** 'నిజముగానే లేవనక్కఱలేదు' అని కూర్చున్నది.

ఇది కోపముకాదు. లక్ష్మణస్వామి యన్న ప్రేమ లేకపోవుట కాదు. ఏమిటో అట్లా జరుగుతున్నది.

వారిద్దరికి ఒకరిమీద నొకరికి ప్రేమలేదా? ఉన్నది. ఎట్టి ప్రేమ? ఇంటిలో తక్కినవారిమీద నెట్లో నట్లే. ఒక జీవిత ప్రవాహమున వారిర్వురును

కలిసి పోవుచున్నామని గాని, వారిర్వురి జీవితముల భేదము లేదనిగాని - యీ యభిప్రాయములు వారికి లేవు. సంసారము చేయుటలేదా? చేయుచున్నారు. వియోగముల వలన గలిగిన దుఃఖములు లేవు. సంయోగముల వలన గలిగిన ఆనందములు లేవు. ప్రణయ రహస్యములు లేవు. లజ్జాకిలికించితములు లేవు. ప్రణయమను వస్తువు వారిలో లేనే లేదు. స్నేహమున్నది. వారిరువురి మధ్య బంధుత్వమున్నది. మరి వారు భార్యాభర్త లేమిటి? ప్రపంచమట్లు జరుగుచున్నది గాన వీరు నంతే. ఒకరోజున నూర్మిళ పెద్ద యద్దములో చూచుకొనుచు తల దువ్వుకొనుచున్నది. లక్ష్మణస్వామి యామె వెనుకవచ్చి నిలుచున్నాడు. ఊర్మిళ 'ఆ! బాగానే వున్నారు' అన్నది. అక్కడనున్న తన మేనత్తతో 'ఎవరు బాగున్నారే అత్తయ్యా' అన్నాడు లక్ష్మణస్వామి, 'ఆ! ఇద్దరు ఒక్కటే అచ్చు' అన్నదావిడ.

'ఇదుగో. అన్యాయపు మాటలు మాటాడకు' అన్నదూర్మిళ. ఇది నవ్వుతూ అన్నమాట కాదు. మనస్సులో ఆ గర్వమున్నదామెకు. లక్ష్మణస్వామికి తెలియునది కూడ. ఏదన్నా సూటిపోటీగా 'నువ్వెక్కడ? అందకత్తెవు' అనును లక్ష్మణస్వామి. 'నేనెట్లాగు అందకత్తెనే' అంటుందామె! కొంచెము కోపము వచ్చును లక్ష్మణస్వామికి, ఎంతసేపు? రెండుగడియలు.

లక్ష్మణస్వామి తండ్రి స్నానము చేయుచుండగా నూర్మిళ గోడకు చేరగిలబడి నిలుచున్నది. లక్ష్మణస్వామి యామె నానుకొని పోయి నిలుచున్నాడు. 'ఆ! ఎ వేషాలకేమి' అన్నదామె.

**తండ్రి** : ఎందుకురా అట్లా నిలుచున్నావు?

**లక్ష్మణ** :మా యిద్దరిలో ఎవరు అందము గలవాళ్ళో చూడటానికి.

**తండ్రి** : దానికి మల్లే నీ వుంటావా?

**లక్ష్మణ** : ఎందుచేత నేమిటి?

**తండ్రి** : ఎట్లాగయినా అది ఆడపిల్ల.

**లక్ష్మణ** : అందమంటే ఆడవాళ్ళకేనా యేమిటి?

**ఊర్మిళ** : మఱి లేకపోతే మగవాళ్ళకందమేమిటి?

ఈ సందర్భములన్నియు నచ్చముగా పల్లెటూరివి. పూర్వకాలపువి. ఇక్కడ కొంచెము ఊర్మిళాలక్ష్మణస్వాముల ముఖలక్షణముల గూర్చి చెప్పవలయును. ఇరువురు నొక్కటే పోలిక. ఇరువురు పలుచనివాళ్ళు. చామనచాయవాళ్ళు. కోలమొగములు. లక్ష్మణస్వామి మొగములో పురుష

లక్షణములు తక్కువ. కాని స్త్రీవలెనుండు ననుటకు వీలులేదు. ఊర్మిళ మొగములో స్త్రీ లక్షణములు తక్కువ. అట్లని పురుష లక్షణములున్న వనుటకు వీలులేదు. ఇరువురి మొగములలోను పోలిక లెక్కువున్నవి. లక్ష్మణస్వామి మీసములు గుబురులై వచ్చినవి. పనిచేయించుకొని యొకనాడు చక్కగా దిద్దించి మీసముల కొనల మెలిపెట్టినాడు లక్ష్మణస్వామి. స్నానము చేయుచు ఊర్మిళను 'మీసము లెట్లున్నవి' అన్నాడు. ఊర్మిళ తెగ నవ్వినది. లక్ష్మణస్వామి 'నేనుగూడ నాడుదాన నయిన బాగుండెడి' దనుకొన్నాడు.

పొలములలో తిరిగి తిరిగి నల్లపడిన లక్ష్మణస్వామి సంవత్సరము వఱకు నిల్లు కదలలేదు. మంచి చాయ తిరిగినాడు. అతడిప్పుడు బాజారు లోనికి పోవుటలేదు. వ్యవహారములు చూచుటలేదు. వాళ్ల పినతండ్రి 'ఏరోయి; అంతకంతకు ఆడదానివలె యింట్లో కూర్చున్నావు' అన్నాడు. ఆ సంవత్సరము సంవత్సరము జుట్టంతా పెంచినాడు. ముందు పాపిడితీపి వెనుక ముడివేసినాడు.

దినదినము నా జుట్టున కమితమైన పోషణచేయును. తలవెంద్రుక లతనివి జగన్మోహనముగా పెరిగినవి. 'నేను స్త్రీవలె నగుదునా, సౌందర్యము నన్ను వరించునా? ఆడవాండ్రంత యందకత్తెలా'యని మనసులో ననుకొనుచుందును. ఇట్లనుకొనునప్పుడెల్ల నతనికను లాలోచనలో నర్ధనిమీలితము లగుచుండును. ఆ యర్ధనిమీలనము కొన్నాళ్ళ కానేత్రములలో మిగిలిపోయినది.

ఎల్లప్పుడును నీడయందుండుట చేతను నిరంతరము తైలసంస్కారము చేతను నతని శరీరము చక్కని చాయదేరి స్నిగ్ధమై సుకుమారమైనది. మునుపు నిరంతరము పొలము పాటుచేత బిగిసిన యతని యొడలు సడలినది. గండభాగముల యందలి కండలుబికి నవ్వినప్పుడు సొట్టలు పడుచున్నవి.

ఇప్పుడతడు ధరించు నుడుపుల యందతనికి నెక్కడలేని శ్రద్ధయు; బట్ట మాయనివ్వడు. తలమీద దుమ్ము పడనియ్యడు.

ఒకనాడు ప్రొద్దున ఊరి బయటకువెళ్ళి యచ్చటకు మంగలిని తీసికొనిపోయి గడ్డమును, మీసములును గొరిగించుకొని చెఱువులో స్నానముచేసి యింటికి వచ్చినాడు. తలపై నుత్తరీయము చుట్టుకొన్నాడు.

ఊర్మిళ వచ్చుచుండగనే చూచి 'ఆ! పగటి వేషములకు పనికివస్తారు' అన్నది. లక్ష్మణస్వామి ముసిముసి నవ్వులు నవ్వుకొన్నాడు.

**లక్ష్మణ :** ఏ వేషము వేయటానికి?

**ఊర్మిళ :** ఆడవేషము.

లక్ష్మణస్వామి భోజనముచేసి ప్రొద్దు వాటారు వేళ మొగమున నున్న గంధాక్షతలు కడుగుకొని తలదువ్వుకొని చుక్కబొట్టు పెట్టుకొని తెల్లని బట్టలు కట్టుకొని గదిలో మంచము మీద కూర్చున్నాడు. జాము ప్రొద్దున్నదిగాని గదిలో చీకటిగానే యున్నది.

లక్ష్మణస్వామి తల్లియేదో పనిమీద గదిలోనికి వచ్చి 'ఊర్మిళా! ఇక్కడ కూర్చున్నావేమి? ప్రొద్దుక్రుంకుట లేదా! కసవూడ్చి నీళ్ళు చల్లి బుడ్లల్లో చమురు పొయ్యి' అని వెళ్ళిపోయినది. ఊర్మిళ కసవూడ్చి నీళ్ళు చల్లిబుడ్లల్లో నూనెపోసి పక్క దులిపి వేయుటకు గదిలోనికి వచ్చినది.

ఊర్మిళ కొక యక్కగారున్నది. ఆవిడయు వూరిలోనే. ఆమెయూర్మిళ కన్న బాగుంటుంది.

ఊర్మిళ 'ఎవరువారు' అన్నది. లక్ష్మణస్వామి మాట్లాడలేదు. ఊర్మిళ 'అక్కయ్యా! ఇక్కడ కూర్చున్నావేమే' అన్నది. లక్ష్మణస్వామి 'ఏమీలేదు' అన్నాడు. అతని గొంతుక అచ్చముగా నాడగొంతుకవలె నున్నది. లక్ష్మణస్వామిపై యుత్తరీయము సరిగా కప్పుకొన్నాడు. ఊర్మిళ యతని దగ్గఱకు వచ్చినది, 'ఇవ్వాళ యింత అందంగా నున్నావేమేనువు' అనుచు. లక్ష్మణస్వామి పకాలున నవ్వినాడు. ఊర్మిళ నివ్వెఱ వోయినది. వారి యిర్వురకు నెదురుగా గోడమీద పెద్ద యద్దమున్నది – ఇరువురి మొగములు నందులో కనబడినవి. ఇద్దరును తలలెత్తినారు. లక్ష్మణస్వామి రాధవలె నున్నాడు. ఊర్మిళ చేటికవలె నున్నది.

ఓడిపోయిన శత్రువుమీద నుండి 'ఓటమి యొప్పుకొనెదవా లేదా'యని యడిగిన యోధునివలె ఊర్మిళవంక చూచినాడు లక్ష్మణస్వామి. లజ్జావనతములును జగన్మోహనములునైన దృక్కులతో నూర్మిళ పరాజయ మొప్పుకొన్నది.

నాడు మొదలూర్మిళ ప్రణయిని యైనది. ఆమె త్రపామధురిమ పరిమళించినది. లక్ష్మణస్వామి వేషము చేతనే స్త్రీగా మిగిలిపోయినాడు.